బోనాల వేడుకలకు ఏర్పాట్లు చేయండి

అబిడ్స్: బోనాల పండుగ నేపథ్యంలో గన్‌ఫౌండ్రీతో పాటు గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీల్లో ఉన్న కమ్యూనిటీ హాళ్లకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని కోరుతూ.... జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి విన్నవించినట్లు జీహెచ్ఎంసీలో బీజేపీ పక్ష ఉప నాయకురాలు, కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ తెలిపారు. చౌదరిబాగ్, బిర్లామందిర్, పూల్‌బాగ్, గన్‌ఫౌండ్రీలతో ఆపటు అన్ని ప్రాంతాల్లో మరమ్మతులు, రంగులు వేయించాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భీశ్వ సురేఖ, భీశ్వ ఓంప్రకాష్

జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో బీజేపీ ఎస్సీ సెల్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓంప్రకాష్ భీశ్వ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా వచ్చిన జోనల్ కమిషనర్‌ను డాక్టర్ సురేఖ భీశ్వ సత్కరించారు.

'కేర్'లో అరుదైన శస్త్ర చికిత్స


వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు న్యూరో విభాగం వైద్యులు అరుదైన బ్రెయిన్ శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన బుధవారం ఎంజేమార్కెట్ కేర్ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ వంశీకృష్ణ బుధవారం వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన మహిళ కొంతకాలంగా కాంట్రాస్ట్ మెదడులో కణితి పెరగడంతో దాని వల్ల ఆమె ప్రాణానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. రోగి స్పృహలో ఉండగానే న్యూరోసర్జన్ విభాగం వైద్యులు డాక్టర్ అరుణారెడ్డి, భవానీ ప్రసాద్, అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ ఇర్ఫాన్ అహ్మద్ తదితర వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించినట్లు తెలిపారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చన


అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

యాకుత్‌పురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా హరిబౌలి గజనన వ్యాయమశాలలోని శ్రీ మాతేశ్వరి పోచమ్మ, మహంకాళీ దేవాలయంలో ఐదు మంగళవారాల పాటు నిర్వహించే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పూలతో ప్రత్యేక ఆలంకరణ చేశారు. అనంతరం ఆలయ అర్చకులు రంగానాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కే. దినేష్, పి.సుశీల్, పి.గోపాల్ యాదవ్, అజయ్, సుధీర్, ప్రకాష్, ప్రభునాథ్, శ్రీనివాస్, అభినవ్‌లు కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


నామినికి చెక్కు అందజేస్తున్న పోస్టల్ అధికారులు

గౌలిపురా: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ ఆగ్నేయ మండలం సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ హైమావతి అన్నారు. ఈ మేరకు బుధవారం చార్మినార్ హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో ఇటీవల పాలసీ తీసుకున్న పాలసీదారుడు మృతి చెందడంతో అతడి భార్య షమీమ్ సుల్తానాకు క్లెయిమ్ సెటిల్‌మెంట్ పాలసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ... పాలసీదారుడు కేవలం 11 నెలల ప్రీమియం మాత్రమే చెల్లించినప్పటికీ.. పాలసీ మొత్తం బోనస్‌తో కలిసి నామినీకి చెక్కు అందజేయడం జరిగిందన్నారు.

న్యాయపరమైన అంశాలను పరిగణలోకి తీసుకోవాలి

యాకుత్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో న్యాయపరమైన అంశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ మసూదుద్దీన్ అహ్మద్ ప్రభుత్వాన్ని కోరారు. దారుషిఫాలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (టీ ఎంఆర్ఈఐఎస్) లో పలు స్థానాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వ జీఓ ఎంఎస్ నెం 05, జీఓ ఎంఎస్ నెం 80 ప్రకారం బదిలీలు చేపట్టాలన్నారు. సీనియర్టీ ప్రకారం పదోన్నతులు కల్పించి... కేటగిరీల ప్రకారం సర్వీస్ పాయింట్లు పొందుపరిచి... గెజిటెడ్ ప్రిన్సిపాల్‌కు ఐదేళ్లు, జూనియర్ లెక్చరర్‌లకు ఎనిమిదేళ్లు పదవీ విరమణ పొందేవారికి మూడేళ్లు వెసలుబాటు కల్పించాలన్నారు. తమ సూచించిన అంశాలను ప్రభుత్వం పరిశీలించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే దీనిపై టీఎంఆర్ఈఐఎస్ సెక్రటరీకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ కృషి చేస్తుందని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అధ్యక్ష కార్యదర్శి మారం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్‌హుస్సేని అన్నారు. బుధవారం టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు మామిడి ప్రభాకర్, హరి ఆధ్వర్యంలో టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతుందన్నారు. ప్రభుత్వంతో ఫ్రెండ్లీగా ఉంటూనే ఉద్యోగుల


టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ నాయకులు క్రాంతి కుమార్, శ్రీకాంత్, రామినేని తదితరులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి తొట్టెలు

అమ్మవారికి మొక్కుల రూపంలో తొట్టెల సమర్పణ

- బోనాల జాతరలో ప్రత్యేక ఆకర్షణ
- ఏటా రూ. కోటికి పైగా వ్యాపారం..


చార్మినార్‌లో తొట్టెల తయారీ

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతరలో తొట్టెలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. మహంకాళి జాతర బోనాల ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి నిష్టతో తొట్టెలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ తొట్టెలు 3 అడుగుల నుంచి 40 అడుగుల ఎత్తువరకు ఉంటాయి. 5 నుంచి 7 అంతస్తులుగా పిలిచే ఈ రంగురంగుల తొట్టెలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. అత్యంత వైభవంగా కన్నుల పండువగా తొట్టెల ఊరేగింపు నిర్వహించి అమ్మవారి దేవాలయాల్లో ఏర్పాటు చేస్తారు. భాజా భజంత్రీలు...పోతరాజుల నృత్యాల నడుమ యువకులు ఘనంగా తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు. అమ్మవారికి తొట్టెల సమర్పించకుండా బోనం పెట్టరు. బోనంతో పాటు అమ్మవారికి తొట్టెల ఎక్కించడం తప్పని సరి. ఆషాఢ మాసం ప్రారంభం నుంచి నెల రోజుల పాటు మహంకాళి అమ్మవారి దేవాలయాల్లో తమ మొక్కుబడులకు అనుగుణంగా భక్తులు మొక్కుల రూపంలో ఈ తొట్టెలను సమర్పిస్తారు. దశాబ్దాలుగా రంగురంగుల తొట్టెలు వాడుకలో ఉన్నాయి. ప్రతి ఏటా గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించే తొట్టెల తయారీ చార్మినార్‌లోనే జరుగుతుంది.

తొట్టెల రూపంలో మొక్కులు..

అమ్మవారికి భక్తులు తొట్టెల రూపంలో మొక్కులు చెల్లించుకుంటారు. ఈ తొట్టెలలో అమ్మవారు సేద తీరుతారని భక్తుల విశ్వాసం. అమ్మవారికి ఊయల లాగా ఈ తొట్టెలను సమర్పిస్తారు. తెలంగాణలో ఏడాది పొడవునా అమ్మవారికి తొట్టెలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. కోరిన కోర్కెలు తీరాలని కొందరు...ఎల్లప్పుడు ఆయు రారోగ్యాలతో ఉండాలని మరికొందరు, తాము అనుకున్న పనులు కావాలంటూ ఇంకొందరు తొట్టెల సమర్పిస్తుంటారు. ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలతో పాటు తొట్టెలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. పూల తొట్టెల, వెండి తొట్టెల, బంగారు తొట్టెల....ఇలా తమ మొక్కులకు అనుగుణంగా భక్తులు అమ్మవారికి తొట్టెల సమర్పిస్తారు. పూల తొట్టెలు గజం పొడవుంటాయి. వెండి,బంగారం తొట్టెలలు భక్తుల ఆర్థిక స్థోమతను బట్టి గ్రాములు, మిల్లి గ్రాముల్లో చిన్నగా ఉంటాయి.

చార్మినార్‌లోనే భారీ తొట్టెల తయారీ



నగరంలోని పలు అమ్మవారి దేవాలయాలకు తొట్టెలను వివిధ ఆకారంలో తయారు చేసి విక్రయిస్తుంటాం. భారీ తొట్టెళ్ల తయారీకి చార్మినార్ ప్రధాన కేంద్రం. ఇక్కడ తయారైన తొట్టెలను నగరంలోని ఇతర ప్రాంతాలకు తీసుకెళతారు.

-పి.ప్రవీణ్, తొట్టెల తయారీదారుడు.

తొట్టెల రకాలు..ధరలు..

- ఏడు బోనాల తొట్టెల.. ఎత్తు 25 అడుగుల పొడవు ఉంటుంది. దీని తయారీకి వారం రోజులు పడుతుంది. నెల రోజులకు ముందుగానే ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని ఖరీదు రూ.45 వేలు.
- సాధారణ ఫలహారపు బండి తొట్టెల.. ఎత్తు 25 అడుగులుంటుంది. తయారీకి నాలుగు రోజుల సమయం పడుతుంది. దీని ఖరీదు రూ.35 వేలు.
- హంస ఫలహారపు తొట్టెల.. దీని ఎత్తు 20 అడుగులు. తయారీకి ఐదు రోజుల సమయం పడుతుంది. దీని ఖరీదు రూ.35 వేలు.
- పొటేల్ తొట్టెల.. దీని ఎత్తు 25 అడుగులు. తయారీకి వారం రోజులు సమయం పడుతుంది. దీని ఖరీదు రూ.35 వేలు.
- పాము, ఛత్రి, కమలం తొట్టెల.. దీని ఎత్తు 20 అడుగులు ఉంటుంది. ఈ తొట్టెల తయారీకి నాలుగు రోజులు పడుతుంది. దీని ఖరీదు రూ.30 వేలు.

నేడు గోల్కొండ అమ్మవారికి రెండో పూజ

గోల్కొండ: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల సందర్భంగా గోల్కొండ కోటలో గురువారం రెండవ బోనం పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు. శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారికి మొత్తం తొమ్మిది పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బోనం పూజకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారన్నారు. మొదటి పూజ కంటే రెండో పూజను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎల్లమ్మ అమ్మవారికి పూజలు


అమ్మవారికి బోనం సమర్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో కోటకు తరలివచ్చారు. అమ్మవారికి పూజలు నిర్వహించి బోనాలు, తొట్టెల సమర్పించారు. మహంకాళీ అమ్మవారి పూజారి బి.సురేష్‌చారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

28న పాతబస్తీలో బోనాల పండుగ

చార్మినార్: పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు ఈ నెల 28న వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు భాగ్యనగర్ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఇందులో భాగంగా బంగారు బోనం పూజలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం రాత్రి బీజేపీ సీనియర్ నాయకులు కొడి మహేందర్, సుమన్ కుమార్, ప్యారసాని వెంకటేష్ తదితరులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఈనెల 21న అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు, 28న, బోనాల సమర్పణ, 29న ఘటం పరిసమాప్తి సామూహిక ఊరేగింపు ఉంటుందన్నారు.

బోనాలకు కట్టుదిట్టమైన బందోబస్తు

గోల్కొండ: గోల్కొండ కోట రెండవ బోనం సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కోటలో శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారి రెండో బోనం జరగనున్న నేపథ్యంలో బుధవారం గోల్కొండ మీర్జా గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆదివారం జరిగిన మొదటి బోనం పూజకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారన్నారు. అయితే పోలీసులు ఎక్కడ కూడా తొక్కిసలాట జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. గోల్కొండ కోట ప్రధాన ద్వారం వద్ద ఒకేసారి భక్తులు రావడం, లోపలికి వెళ్లడానికి భక్తులు ఇబ్బందిపడ్డారని ఆయన అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గురువారం జరిగే బోనం పూజ సందర్భంగా గోల్కొండ చౌరస్తా వద్ద పోలీసులను ఎక్కువ సంఖ్యలో నియమించి భక్తులకు ఇబ్బందులు లేకుండా కోట లోపలికి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాందేవ్‌గూడ, ఫతేదర్వాజ, జమాలి దర్వాజ, బంజారి దర్వాజ వైపు నుంచి ఒకేసారి భక్తులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన దర్వాజాల వద్ద విధులు నిర్వహించే పోలీసులు ఎప్పటికప్పుడు సంప్రదించుకుంటూ


మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

భక్తులను కోటవైపు వెళ్లేలా చూడాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు సైతం ఎప్పుడు అప్రమత్తంగా ఉంటూ వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్దేశించిన ప్రదేశాలలోనే వాహన యజమానులు తమ వాహనాలను పార్కు చేయాలని సూచించారు. పోలీసులకు స్థానిక పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఎంతగానో సహకరించారన్నారు. స్థానిక యువకులు సైతం బోనాలు ప్రశాంతంగా జరిగేందుకు తమకు సహకరించాలని కోరారు. మహిళా బృందాలను ఏర్పాటు చేసి మహిళా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ డి.సైదులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల్లా నటించి.. కత్తులతో బెదిరించి...

- సెల్‌ఫోన్ల చోరీ
- నిందితుల అరెస్ట్

లంగర్‌హౌస్: ప్రయాణికుల్లా నటిస్తూ, కత్తులతో బెదిరించి సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌లతో కలిసి డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. టోలీచౌకికి చెందిన అబ్దుల్ హసన్ ఈ నెల 5న రాత్రి ఖాజాగుడ నుంచి నానల్‌నగర్ వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అప్పటికే ఆటోలో ముగ్గురు ప్రయాణికులు కూర్చుని ఉన్నారు. నానల్‌నగర్ వద్ద అతను ఆటో దిగే ప్రయత్నం చేయగా ముందు నిలుపుతానని చెప్పిన డ్రైవర్ జనాలు లేని ప్రాంతంలో ఆటో నిలిపాడు. అదే సమయంలో మరో వ్యక్తి వచ్చి ఆటోలో నుంచి అతడి దిగనివ్వకుండా అడ్డుకోగా మరో వ్యక్తి అబ్దుల్ హసన్‌కు కత్తి చూపించి బెదిరించి సెల్‌ఫోన్, పర్సు లాక్కుని అతడిని ఆటోలోనుంచి కిందకు తోసి అక్కడి నుంచి పరారయ్యారు.

నిందితుల రిమాండ్..

బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం రాత్రి నానల్‌నగర్ వద్ద ఆటోలో తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు.వారిని విచారించగా సెల్‌ఫోన్లు దొంగిలించి నిజామాబాద్‌లో తమ స్నేహితులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రధాన నిందితుడు మెహమ్మద్ సజ్జద్, ఆటో డ్రైవర్ సయ్యద్ టౌకిరీ హుస్సేన్, సయ్యద్ వలి హుస్సేన్‌తో పాటు నిజామాబాద్‌కు చెందిన సయ్యద్ రెహ్మతుల్లాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిజామాబాద్‌కు చెందిన మరో నిందితుడు నౌమన్ పరారీలో ఉన్నాడు. వీరి నుంచి 20 సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజుల్లో కేసు చేదించిన ఎస్సై రాఘవేంద్ర, కానిస్టేబుళ్లు దశరథ్, రవీందర్, వల్లపు క్రిష్ణ, సాగర్, క్రాంతి సాయిలను డీసీపీ అభినందించారు.

మహ్మద్ నజీబ్‌కు సన్మానం

గోల్కొండ: పేద మహిళలకు న్యాయ సలహాలు అందించడానికి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు ఆయేషాబేగం అన్నారు. మహిళలకు గత 15 ఏళ్లుగా అండగా ఉంటున్న తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్‌ను బుధవారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న కారణాల వల్ల పోలీసులు, కోర్టులను ఆశ్రయించే వారికి తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ అండగా ఉండి వారి సమస్యలను కోర్టు వెలుపలే పరిష్కరి


మహ్మద్ నజీబ్‌ను సన్మానిస్తున్న ఆయేషాబేగం

స్తుందన్నారు. దీన్ని వల్ల పేద కుటుంబాల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అంతేకాకుండా పేద బడుగు వర్గాల పిల్లలు చదువుకునేందుకు కూడా పిఎఫ్‌సిఓ ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాలో పిఎఫ్‌సిఓ కార్యాలయాలు ప్రారంభిస్తే మరింతమందికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహ్మద్ ఫహాజ్, ఇర్ఫాన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం


దివ్యాంగుడు జాహెద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: దివ్యాంగులు, వృద్ధులకు మజ్లిస్ పార్టీ అండగా ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ మజ్లిస్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాహెద్ ఎమ్మెల్యేను కలిశారు. వికలాంగుడినైన తాను 15 ఏళ్లుగా టైలరింగ్ షాపు నిర్వహిస్తూ మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపాడు. షాపును మరింత విస్తరించడానికి బ్యాంకు తనకు రుణాలు ఇవ్వడం లేదని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. బ్యాంకులు లేదా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రుణం ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆయనకు హామీ ఇచ్చారు.

రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తుల స్వీకరణ

నాంపల్లి: ప్రజలకు అత్యవసరమైన రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందని, ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెహిదీపట్నం పౌర సరఫరాల శాఖ సహాయ అధికారి వెంకటేష్ అన్నారు. రేషన్ కార్డులో కొత్తగా కుటుంబ సభ్యులను చేర్చుటకు, తప్పులను సవరించుటకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డులో సవరణలు చేసేందుకు కుటుంబ యజమాని బ్యాంక్ పాస్ పుస్తకం లేదా ఓటరు కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు జిరాక్స్ తీసుకుని అందుబాటులో ఉన్న మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే దరఖాస్తులు చేసుకున్న వారికి రేషన్‌కార్డుల్లో మార్పులు చేస్తామని ఆయన వివరించారు.

సిటీ సివిల్ కోర్టులో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న సిటీ సివిల్ కోర్టు జడ్జి రేణుకా యారా

యాకుత్‌పురా: పీ వీ నరసింహారావు చారి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్, హెచ్‌డీఎఫ్‌సీల సంయుక్తాధ్వర్యంలో బుధవారం పురానీహవేలీలోని కోర్టులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సిటి సివిల్ కోర్టు ఛీఫ్ జడ్జి రేణుకా యారా ప్రారంభించారు. ఈ సందర్భంగా 20 మంది న్యాయవాదులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై. శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ ఉపాధ్యక్షురాలు ప్రవీణా రెడ్డి, సంయుక్త కార్యదర్శి, రక్తదాన శిబిరం కన్వీనర్ బర్కా రాజేష్ కుమార్, ట్రస్టు నిర్వాహకులు, వైద్యులు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భారతీయ నృత్యం ఆధ్యాత్మిక సంస్కృతికి మూలం


నృత్యకారిణిలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు

సుల్తాన్‌బజార్: భారతీయ నృత్యం ఆధ్యాత్మిక సాంస్కృతికి మూలమని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచంద్రరావు అన్నారు. శ్రీ శృంగేరి శంకరమఠం సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, శ్రీవాణి విద్యానికేతన్ నంది కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ కూచిపూడి నృత్య ప్రదర్శన కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో భాగంగా నందిని అద్భుతంగా నర్తించి ప్రశంసలు అందుకున్నారు. రమావాణి ఆధ్వర్యంలో ఆమె శిష్యురాలు పలు నృత్యాలను ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో శంకరమఠం ఈఓ కృష్ణారావు, ప్రముఖ కవి రఘుశ్రీ, మాడుగుల గురునాథ్‌శర్మ, ప్రసన్న, రత్నమాల, సంస్థ అధ్యక్షురాలు తాళ్లపర్తి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్‌హెచ్ఎం సీఐటీయూ యూనియన్ నాయకులు

సుల్తాన్‌బజార్: ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్నా అన్నారు. ఈ మేరకు బుధవారం కోఠి డీఎంహెచ్ఎస్‌లోని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో పనిచేస్తున్న దాదాపు 15 వేల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ఉద్యోగులకు ప్రతి నెల 5లోగా జీతాలు అందే విధంగా చూస్తానని ఆర్‌వి. కర్ణన్ హామీ ఇవ్వడంతో తాము చేపట్టదలచిన సమ్మెను విరమించనున్నట్లు వారు ప్రకటించారు. అదేవిధంగా 7 నెలలు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరడంతో నిధులు సమకూర్చి తమకు జీతాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగుల బాలసుబ్రమణ్యం, సరికొండ సురేష్ గౌడ్ ఆయుష్, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, లోకేష్, గణేష్, జ్యోతి, వరలక్ష్మీ, సోమశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన అవసరం

అబిడ్స్: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) డెక్కన్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఫాస్ట్ పుడ్స్, చక్కెర పానీయాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలతో పిల్లల దంతాలకు ముప్పు తప్పదని హెచ్చరించారు. ఐడీఏ డెక్కన్ బ్రాంచ్, లిటిల్ ఫ్లవర్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎల్ఎఫ్ఎల్ఓఎస్) ఆధ్వర్యంలో బుధవారం అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నేషనల్ స్కూల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈ అలవాట్లు దంతాలు, చిగుళ్లకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయన్నారు. ఇది దంత క్షయం, ఫలకం ఏర్పడటం, టార్టార్ నిక్షేపాలు, మరకలు, దుర్వాసన వంటి సమస్యలకు దారి తీస్తుందన్నారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ప్రిన్సిపాల్


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ రేవ్ బ్రదర్ షాజాన్ ఆంటోనీ

రేవ్ బ్రదర్ షాజన్ ఆంటోని మాట్లాడుతూ.... దంతాలను ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకోవాలన్నారు. దంత సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ శిబిరంలో వైద్యులు విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా వైద్యులు దంతాల నమూనాలను ఉపయోగించి బ్రషింగ్ పద్ధతులను ప్రయోగాత్మకంగా చూపారు. తాజా ఆహార పదార్థాలు తీసుకోవడం, స్వీట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ప్రతి రోజు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనురాగ్, డాక్టర్ అర్జున్ యాదవ్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ శ్రేయతో పాటు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.